# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-03-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల కేటాయింపులపై వచ్చే నెల 8వ తేదీ నుంచి బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ విచారణ ప్రారంభించనుంది.**

2. **తెలంగాణ ప్రజలకు వచ్చే జులై నుంచి హెల్త్ ప్రొఫైల్ కార్డులను అందజేస్తామని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు.**

3. **తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఈ నెల 27 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాగళం పేరుతో ఎన్నికల ప్రచారం, సభలు, రోడ్డు షోలు నిర్వహించనున్నారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి విద్యాహక్కు చట్టం కింద దరుఖాస్తు గడువును రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పొడిగించింది.**

5. **ఈరోజు దేశవ్యాప్తంగా హోలీ పండుగను జరుపుకుంటున్నాం.**

=========================

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపులపై వచ్చే నెల 8వ తేదీ నుంచి బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్.. కేడబ్ల్యూడీటీ-2 విచారణ ప్రారంభించనుంది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో నీటిని పునఃపంపిణీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాల చట్టంలోని సెక్షన్-3 ప్రకారం ఈ ట్రైబ్యునల్‌కు గతేడాది చివర్లో విధివిధానాలు ఖరారు చేసింది. ఈ క్రమంలో ట్రైబ్యునల్ ముందు స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్..ఎస్ఓసీ నమోదుకు రెండు రాష్ట్రాలకు గడువు విధించింది. తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎస్ఓసీ దాఖలుకు ఆమోదం లభించడంతో నిన్న నీటిపారుదలశాఖ ఎస్ఓసీ సమర్పించింది. ఆంధ్రప్రదేశ్ ఎస్ఓసీ దాఖలు చేయాల్సి ఉంది.

-------------------------

తెలంగాణ ప్రజలకు వచ్చే జులై నుంచి హెల్త్ ప్రొఫైల్ కార్డులను అందజేస్తామని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. హైదరాబాద్‌లో మంథని వైదిక సంస్థ ఆధ్వర్యంలో నిన్న ఆయనకు సత్కారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ఎలాంటి భేషజాలకు పోకుండా ప్రజలు గర్వించేలా పనిచేస్తామని అన్నారు. ఆధార్ కార్డు సంఖ్య తరహాలో ఒక్కో

పౌరుడికీ స్మార్ట్‌కార్డు వంటి హెల్త్ ప్రొఫైల్ సంఖ్యతో గుర్తింపు కల్పిస్తామని తెలిపారు. పేరు నమోదు చేస్తే సమగ్ర వైద్య సేవల వివరాలు తెలుసుకునేలా చర్యలు చేపట్టామని, ఏ వైద్యుడిని సంప్రదించినా వారి ఆరోగ్య స్థితిగతులను వెంటనే తెలుసుకుని మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఇది దోహదపడుతుందని శ్రీధర్‌బాబు వెల్లడించారు.

---------------------------

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఈ నెల 27 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాగళం పేరుతో ఎన్నికల ప్రచారం, సభలు, రోడ్డు షోలు నిర్వహించనున్నారు. రోజుకు మూడు నుంచి నాలుగు నియోజకవర్గాల్లో సభలు, రోడ్డు షోలు సాగేలా పార్టీ నేతలు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు 27వ తేదీ నుంచి 31 తేదీ వరకు చంద్రబాబునాయుడు పర్యటన ఖరారైంది. 27వ తేదీ పలమనేరు, నగరి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. 28వ తేదీన రాప్తాడు, శింగనమల, కదిరిలో పర్యటిస్తారు. 29వ తేదీ శ్రీశైలం, నందికొట్కూరు, కర్నూలు, 30వ తేదీ మైదుకూరు, ప్రొద్దుటూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, 31వ తేదీ కావలి, మార్కాపురం, సంతనూతలపాడు, ఒంగోలులో చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. కాగా.. ఈ రోజు, రేపు ఆయన తన సొంత నియోజకవర్గం చిత్తూరు జిల్లా కుప్పంలో పర్యటిస్తారు.

---------------------------

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఐదో జాబితాను భారతీయ జనతా పార్టీ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన పార్టీలతో పొత్తులో భాగంగా భారతీయ జనతా పార్టీకి 6 లోక్‌సభ, 10 శాసనసభ స్థానాలు కేటాయించిన నేపథ్యంలో.. ఆ పార్టీ తరఫున పోటీ చేసే ఎంపీ అభ్యర్థులను అధిష్ఠానం నిన్న రాత్రి ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆరుగురు, తెలంగాణ నుంచి ఇద్దరు అభ్యర్థులను ఖరారు చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు స్థానం నుంచి కొత్తపల్లి గీత, అనకాపల్లి స్థానంలో సీఎం రమేష్, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి దగ్గుబాటి పురందేశ్వరి, పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో భూపతిరాజు శ్రీనివాస వర్మ, తిరుపతి లోక్‌సభ స్థానం నుంచి వరప్రసాదరావు, అన్నమయ్య జిల్లా రాజంపేట స్థానం నుంచి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించింది. అదే విధంగా తెలంగాణలోని వరంగల్ లోకసభ స్థానానికి ఆరూరి రమేశ్, ఖమ్మం నుంచి తాండ్ర వినోద్‌రావును అభ్యర్థులుగా బీజేపీ ప్రకటించింది.

---------------------------

తెలంగాణలోని భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ఏప్రిల్ 17వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు సెక్టార్ టికెట్లను ఈ రోజు నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నారు. 18వ తేదీన పట్టాభిషేక మహోత్సవం సెక్టార్ టికెట్లను bhadradritemple.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాదేవి నిన్న ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణం రోజు ప్రత్యక్షంగా హాజరుకాలేని భక్తులు పరోక్ష పద్ధతిలో తమ గోత్రనామాలతో పూజ చేయించుకునే వెసులుబాటు కల్పించామని.. ఈ టికెట్లను ఇదే వెబ్‌సైట్ నుంచి బుక్ చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి విద్యాహక్కు చట్టం కింద దరుఖాస్తు గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. గతంలో ప్రకటించిన ప్రకారం ఈ రోజుతో గడువు ముగుస్తుండగా, విద్యాశాఖాధికారులు ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రతికూల పరిస్థితుల్లోని పిల్లలైన అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలకు విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో

ఉచిత ప్రవేశాలు కల్పిస్తారు. ఇప్పటివరకు 49 వేల 208 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 38 వేల 150 మంది పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు.

---------------------------

చట్టబద్ధమైన విధానాన్ని అనుసరిస్తూ ఈ నెల 26 వ తేదీ నాటికి ఫారం-7,8లను పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు కల్పించాలనీ, సి విజిల్ యాప్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలనీ సూచించారు. ఎలక్ట్రానిక్ సీజన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని పటిష్టంగా అమలుపరచాలని ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.

---------------------------

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది. అందులో భాగంగా 85 ఏళ్లు పైబడినవారు, 40శాతానికిపైగా అంగ వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచే ఓటు వేయవచ్చు. నిబంధనలకు అనుగుణంగా ఓ కంపార్టుమెంట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను తీసుకువచ్చి పోలింగ్ సిబ్బంది ఓటరు ఇంటి వద్దకే వచ్చి ఓటు వేయించుకుంటారు. ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటును ఉపయోగించుకోవాలనుకునే వృద్ధులు, దివ్యాంగులు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన 5 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం ఫారం 12డి ని రిటర్నింగ్ అధికారికిగానీ, సహాయ రిటర్నింగ్ అధికారికిగానీ పంపించాలి. దరఖాస్తు చేసుకునేవారు తమ పూర్తి చిరునామా, సంప్రదించాల్సిన ఫోన్ నంబరు పొందుపరచాలి. ఈ దరఖాస్తు ఎన్నికల సంఘం వెబ్ సైట్లో అందుబాటులో ఉంది.

---------------------------

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని వివిధ రకాల ప్రింటింగ్ ప్రెస్లు, ముద్రణ సంస్థలు కరపత్రాలు, పోస్టర్లు.... ప్రింటింగ్ విషయంలో నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా నిన్న ఒక ప్రకటనలో కోరారు. కరపత్రాలు, పోస్టర్లు ముద్రించి నపుడు సంబంధిత పత్రాలపై ప్రింటర్, పబ్లిషర్ పేర్లు, చిరునామా స్పష్టంగా ఉండాలని పేర్కొన్నారు. పబ్లిషర్ చిరునామా కాపీలు రెండింటిని.... ముంద్రించిన కాపీలను వెంటనే జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి తప్పనిసరిగా అంద జేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన ప్రింటింగ్ ప్రెస్‌ల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లాలో ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు గ్రామ/వార్డ్ సచివాలయాలు ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి ఫోటో లేని ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నామని జిల్లా పరిషత్ సీఈఓ కె. ఎస్.ఎస్.సుబ్బారావు తెలిపారు. వివిధ ధ్రువీకరణ పత్రాల జారీ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఏలూరు జిల్లాకు 88 వేల ధ్రువపత్రాల ఫారాలను మంజూరు చేసిందని, జిల్లాకు ఇప్పటికే 44 వేల హై సెక్యూరిటీ ధ్రువపత్రాల ఫారాలు అందాయని, వాటిని జిల్లాలోని అన్ని గ్రామ/వార్డ్ సచివాలయాలకు ధ్రువీకరణ పత్రాల జారీకి పంపామని తెలిపారు.

కాగా ఏలూరు ఆర్డీవో, ఉంగుటూరు అసెంబ్లీ నియోజవర్గ రిటర్నింగ్ అధికారి ఎన్.ఎస్.కె.ఖజావలి ఆధ్వర్యంలో నిన్న భీమడోలు చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు.. నగదు,బహుమతులు రవాణా తదితర అంశాలపై తనిఖీలు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

---------------------------

ఈరోజు దేశవ్యాప్తంగా హోలీ పండుగను జరుపుకుంటున్నారు. దీనిని రంగులపండుగగా పిలుస్తారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో ఈ పండుగలో పాల్గొంటారు. హోలీ పండుగను పురాణాల్లో ప్రాముఖ్యత ఉంది. ప్రతీఏడాది పాల్గుణమాసంలో పౌర్ణమిరోజున ఈ హోలీ జరుపుకుంటారు.

======================